క్లుప్తంగా

వైభవంగా గ్రామోత్సవం



పెనమలూరు: పోరంకి గ్రామంలో శ్రీ చెన్నకేశవస్వామివార్ల గ్రామోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవం సోమవారం జరుగగా మంగళవారం ఉదయం నిత్య హోమం చేపట్టారు. సంతాపప్రాప్తి కోసం పుత్రకామేష్టి హోమం చేశారు. మధ్యాహ్నం స్వామివార్ల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి, మేళతాళాలతో గ్రామంలో స్వామివార్ల గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకోని కొబ్బరికాయలు కొట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణ, రాత్రి సామూహిక రమా సహిత సత్యదేవ వ్రతం, మంత్రపుష్పం తీర్థగోష్టి చేసి భక్తులు ప్రసాదం పంపిణీ చేశారు. బుధవారం ఉదయం 11 గంటలకు ఆలయం వద్ద భక్తులకు అన్నసమారాధన జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



నున్న(విజయవాడరూరల్): రుతు పరిశుభ్రతపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ విజయవాడ రూరల్ సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్.స్వర్ణకుమారి సూచించారు. నున్న గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం – 3లో మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్వర్ణకుమారి మాట్లాడుతూ.. పీరియడ్ టైమ్‌లో ఆడపిల్లలు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, తీసుకోవాల్సిన ఆహారం, తినకూడని ఆహారం తదితర విషయాలను వివరించారు. సా స్వచ్ఛందసేవా సంస్థ మేనేజర్ రీతా మాట్లాడుతూ శానిటరీ న్యాప్‌కిన్స్ ఉపయోగించే విధానంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సామాజిక కార్యకర్త వి.శారద, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

గణపతి పూజతో దీక్ష విరమణలకు అంకురార్పణ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీ హనుమత్ దీక్షా పీఠంలో మంగళవారం దీక్ష విరమణ మహోత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశస్థాపనను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. పూజా కార్యక్రమాలను పీఠాధిపతి శ్రీదుర్గాప్రసాద్ స్వామిజీ పర్యవేక్షించారు. బుధవారం నుంచి అభయ వీరాంజనేయ స్వామి వారికి అభిషేకాలు, అర్చన, తమలపాకులతో పూజ జరుగుతుందని దుర్గాప్రసాద్ స్వామిజీ పేర్కొన్నారు.

రంజింపజేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో అనంతపురం జిల్లా కదిరికి చెందిన సంజయ్ నాట్య కళాక్షేత్రం చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను రంజింపజేసింది. మంగళవారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై వీరు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న నృత్య ప్రదర్శనను ఆద్యంతం ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం చిన్నారులకు అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదాలను అందజేశారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

- గ్రంథాలయాధికారులు
- కొనసాగుతున్న వేసవి శిక్షణ తరగతులు
- ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు



పురుషోత్తపట్నంలో యోగా సాధన చేస్తున్న విద్యార్థులు

గన్నవరం: గ్రంథాలయాల్లోని అమూల్యమైన పుస్తక సంపదను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంత హిందీ పండిట్ కంభంపాటి ధర్మారావు పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు చదరంగం, క్యారమ్ బోర్డు వంటి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవార్చుకోవాలని సూచించారు. దీనివల్ల విద్యార్థుల్లో మేధోశక్తి, విషయ పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహిస్తున్న సిబ్బందిని ఆయన అభినందించారు. ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి డి.బాబూరావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో ఉత్తమ జీవన విధానం

గన్నవరంరూరల్: మండలంలోని ముస్తాబాద, పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయాల్లో మంగళవారం విద్యార్థులకు సమ్మర్ క్యాంప్‌లో భాగంగా యోగా నేర్పించారు. పురుషోత్తపట్నం గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం మాట్లాడుతూ విద్యార్థులకు చిన్ననాటి నుంచి యోగా నేర్పాలని చెప్పారు. యోగా మన జీవన విధానం కావాలన్నారు. ప్రాచీన భారతీయ కళ యోగా అని పేర్కొన్నారు. సమ్మర్ క్యాంప్‌లో భాగంగా విద్యార్థులు చదవటం, డ్రాయింగ్, ఆటల పోటీలు, యోగా వంటి పోటీల్లో పాల్గొనటం, తల్లిదండ్రులు ప్రోత్సహించటం అభినందనీయమని చెప్పారు. పాఠకులు, గ్రామ పెద్దలు విద్యార్థులను అభినందించారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా పుస్తక పఠనం చేయించారు. పలువురు గ్రామ పెద్దలు వారిని అభినందించారు. లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి పర్యవేక్షణలో విజేతలకు ప్రోత్సాహకాలు అందించారు.



తెన్నేరులో లెమన్‌స్పూన్ ఆడుతున్న విద్యార్థులు

క్రీడలతో మానసిక ఉల్లాసం

కంకిపాడు: క్రీడలతో ఆరోగ్యం, మానసిక ఉల్లాసం లభిస్తాయని తెన్నేరు గ్రంథాలయాధికారి ఎస్.సునీత తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్స్, చెస్, క్యారమ్స్‌లలో పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటి విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. గ్రంథాలయాధికారి సునీత మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు ఆసక్తి గల రంగాలను ఎంచుకుని నైపుణ్యం ప్రదర్శించాలని సూచించారు.

కృష్ణా జిల్లాలో కలెక్షన్ కింగ్

- ఎన్నికల ఫండ్‌తో జోరుగా పందేలు
- జువ్వలపాలెంలో రూ.5 కోట్ల మేరకు పందెం
- రయ్ మంటూ తిరిగేందుకు రెండు కార్లు రెడీ
- మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలో ఓ అభ్యర్థి ముందుచూపు
- ముక్కున వేలేసుకుంటున్న అనుచరగణం



కంకిపాడు: సీటు దక్కకపోయే సరికి అధిష్టానంపై ధిక్కార స్వరం వినిపించాడు. తనకు అన్యాయం జరిగిందంటూ నాలుగు కన్నీటి బొట్లు రాల్చాడు. ఆఖరికి తమదీ బాధ్యత అని ఎన్‌ఆర్‌ఐలు రంగంలోకి దిగటంతో సీటు దక్కింది. జిల్లాలోనే ఇబ్బందులున్న అభ్యర్థిగా తేల్చి కమ్మగా కాపాడారు. ఎన్నికల్లో పోటీ పేరుతో ఫండ్ భారీగా వసూలు అయ్యింది. ఇప్పుడా సొమ్ముతో జూదానికి తెరతీశాడు. ప్రభుత్వం, అభ్యర్థుల గెలుపు ఓటములపై భారీగా బెట్టింగులు కడుతున్నాడు. దాంతో పాటు కొంత సొమ్ము ముందుచూపుతో జాగ్రత్త కూడా చేసుకుని ఇల్లు చక్కబెట్టుకుంటున్నాడు. మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలోని ఓ నియోజకవర్గ అభ్యర్థి వ్యవహారం హాట్‌టాపిక్ కావటంతో అనుచరగణం మాత్రం ఇదెక్కడి యవ్వారం అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

మొదటి నుంచీ అదే తంతు..

మొదటి నుంచీ సీటు తనదేనని చెప్పిన ఆయన ప్రతికూల పవనాలు వీచే అవకాశం ఉందని తెలియటంతో తనకు ఉన్నదంతా పార్టీ కోసమే ఖర్చు పెట్టానని ప్రతి మీటింగ్‌లోనూ చెప్పుకుంటూ సానుభూతి కూడబెట్టుకున్నాడు. పదవి లేకున్నా అండగా ఉన్నానంటూ చెప్పాడు. గత ప్రభుత్వంలో అగ్రకుల పెద్దలకు తన వంతు సహాయ సహకారాలు అందించటంతో వారంతా భుజాన ఎత్తుకున్నారు. వీరికి ఎన్‌ఆర్‌ఐల సపోర్టు కూడా భారీగానే దొరికింది. దీంతో ఏ అభ్యర్థికీ రాని విధంగా రూ.50 కోట్లు పైగా ఎన్నికల ఫండ్ సమకూరిందని సమాచారం. దీనికి ఓ కమిటీ కూడా బాధ్యతతో పనిచేసి చందాలు రాబట్టిందంటున్నారు. ఎంపీ అభ్యర్థి, పార్టీ అధిష్టానం నుంచి వచ్చిన కోట్ల రూపాయలు మాత్రం ఎన్నికలకు వెచ్చించాడని ఎన్నికల ఫండ్ మాత్రం రూపాయి కూడా బయటకు తీయలేదని పార్టీ శ్రేణులే గుసగుసలాడుకుంటున్నాయి. ముందు చూపుతో జాగ్రత్త చేసి, ఇల్లు చక్కదిద్దుకున్నాడంటూ ఆ పార్టీ నేతలు చెప్పుకుంటున్నారు.

ఎక్కడైనా పందెం రెడీ..

గత ఎన్నికల్లోనూ ఇదే ధీమా ప్రదర్శించాడు. ఎన్నికల ఫండ్‌లో రూ.4 కోట్లు వివిధ ప్రాంతాల్లో పందేలు కట్టి ఎన్నికల్లో వచ్చిన ఫలితాలతో బోల్తా పడ్డాడు. ఈ దఫా మరింత రెట్టింపు ధీమాతో పందేలు రెడీ అయ్యాడు. ఇప్పటికే జువ్వలపాలెంలో రూ.5 కోట్లు పందెం కట్టాడని చెబుతున్నారు. ఎన్నికల అనంతరం రయ్ మంటూ తిరిగేందుకు రెండు కార్లు కూడా కొని సిద్ధం చేసుకున్నారట. ఎలాగైనా కూటమి వస్తుందనే ధీమాతో పందేలను ప్రోత్సహిస్తూనే ముందుచూపుతో కార్లు కొనటం, ఎన్నికల ఫండ్ జాగ్రత్త చేసుకోవటం చేశారు. ఎలాగో కూటమి వచ్చే అవకాశం లేదని ముందుచూపు ప్రదర్శిస్తున్నాడా? అంటూ పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎన్నికలు అయిన నాటి నుంచి శ్రేణులతో మంచి చెడు మాట్లాడటం చేయటం లేదని వాపోతున్నారు. అవసరం ముగిశాక అల్లుడు... ఏదో అన్నట్లు తమ పరిస్థితి మారిందని పెదవి విరుస్తున్నారు. మొత్తం మీద ఎన్నికల ఫీవర్ మొదలైన నాటి నుంచి నేటి వరకూ అభ్యర్థి వ్యవహారశైలిపై సొంత వర్గాలే ముక్కున వేలేసుకోవటం హాట్ టాపిక్ అయ్యింది.

కౌంటింగ్ సమయంలో ఏజెంట్లు నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి రాజు

పెనమలూరు: సాధారణ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు సమయంలో రాజకీయ పార్టీల నేతలు, ఏజెంట్లు విధిగా ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.రాజు తెలిపారు. పెనమలూరు తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల నేతలకు, అభ్యర్థులకు ఓట్ల లెక్కింపు ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. మచిలీపట్నం కృష్ణా యూనివర్సిటీలో జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. పార్లమెంట్, అసెంబ్లీకి 14 టేబుళ్ల చొప్పున ఓట్ల లెక్కింపును చేపడతామని చెప్పారు. యూనివర్సిటీ రూమ్ నంబర్ 201 ఎలో ఓట్ల లెక్కింపు ఉంటుందని, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపు రూమ్ నంబర్ 208లో జరుగుతుందన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఆయా పార్టీల నుంచి పాల్గొనే ఏజెంట్ల పేర్లు ముందుగా తమకు అందజేయాలన్నారు. ఏజెంట్ల జాబితాను పోలీసులు తనిఖీ చేస్తారని చెప్పారు. కేసులు ఉన్న వారిని ఏజెంట్లగా అనుమతించమని, ఓట్ల లెక్కింపు ప్రాంతంలోకి సెల్‌ఫోన్‌లు అనుమతించమని స్పష్టం చేశారు. అభ్యర్థులు, ఏజెంట్లు నిబంధనలు అతిక్రమిస్తే ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఆర్‌వోలు ప్రసాద్, ఎం.వెంకటేశ్వరరావు, డీటీ భవాని, పోలీసు అధికారులు, పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు శ్రీలక్ష్మీ వసుంధర భరతనాట్యం అరంగేట్రం



భవానీపురం(విజయవాడపశ్చిమ): దక్షిణ భారత దేశంలో నాట్య శాస్త్రం రచించిన భరతముని పేరుతో పుట్టి ప్రసిద్ధి గాంచిన ఒక శాస్త్రీయ నృత్య విధానం భరత నాట్యం. పురాతన దేవాలయాలలో శిల్పాలు భరత నాట్య భంగిమలలో అప్సరసలు నాట్యం చేస్తున్నట్లుగా తీర్చిదిద్దబడి ఉండటం అందరికి తెలిసిందే. అటువంటి అద్భుత భరత నాట్యంలో గన్నవరానికి చెందిన చిన్నారి శ్రీలక్ష్మీ వసుంధర వల్లభనేని బుధవారం సాయంత్రం 6 గంటలకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో తన భరత నాట్య ప్రదర్శనతో అరంగేట్రం చేస్తోంది. గన్నవరం శాసనసభ్యుడు వల్లభనేని వంశీ – డాక్టర్ పంకజశ్రీ తనయ శ్రీలక్ష్మీ వసుంధర. తల్లి డాక్టర్ పంకజశ్రీ ప్రోత్సాహంతో ఈ చిన్నారి తన 6వ ఏట నుంచే శ్రీనృత్య ఆర్ట్ అకాడమీకి చెందిన ప్రముఖ నాట్యాచారిణి డాక్టర్ భాగవతుల సౌమ్య వద్ద భరత నాట్యంలో శిక్షణ తీసుకుంది. ఈ అరంగేట్రంలో భరతనాట్యంలోని పలు అంశాలకు శ్రీలక్ష్మీ వసుంధర వల్లభనేని నర్తించనుంది.

అవరోధాలను అధిగమిస్తే విజయాలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మార్కెటింగ్‌లో ఎదురయ్యే అవరోధాలను అధిగమిస్తే మంచి విజయాలను పొందవచ్చని ఫైన్ ల్యాబ్స్ సేల్స్ మేనేజర్ పి.నరేష్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల పీజీ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ మార్కెటింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని 'మార్కెటింగ్ అవకాశాలు – అవరోధాలు' అంశంపై సదస్సును మంగళవారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ ఏ రంగంలోనైనా మార్కెటింగ్ ఆ సంస్థల విజయావకాశాలను ప్రభావితం చేస్తాయన్నారు. మార్కెటింగ్‌లో రాణిస్తే ఆ సంస్థ అద్భుతమైన విజయాలను, దానితో పాటుగా ఆర్థికశక్తిని పెంచుకోవటానికి అవకాశాలు ఉంటాయన్నారు. అయితే మార్కెటింగ్‌లో చాలా అవకాశాలతో పాటుగా అవరోధాలు సైతం ఎదురవుతాయన్నారు. విద్యార్థులు అవరోధాలను అధ్యయనం చేసినప్పుడు సమస్యలు వాటి పరిష్కారాలు తెలుసుకోవటానికి అవకాశం ఉంటుందన్నారు. ఏ రంగంలోనైనా అవగాహన, అధ్యయనం లేకుండా మార్కెటింగ్ అంశంలో రాణించటానికి అవకాశం ఉండదన్నారు. విద్యార్థులు ఆ దిశగా తమ దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులకు వారివారి రంగాల్లో చోటు చేసుకున్న అంశాలను తెలుసుకోవటానికి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పీజీ డైరెక్టర్ ఎస్.వెంకటేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట నిఘా

- సీఐ శ్రీనివాసరావు
- ఈడుపుగల్లు బీసీ కాలనీలో కార్డన్ సెర్చ్
- సరైన పత్రాలు లేని 20 వాహనాల సీజ్



స్వాధీనం చేసుకున్న వాహనాలతో కంకిపాడు పోలీసులు

కంకిపాడు: ఎన్నికల కోడ్ అమలు దృష్ట్యా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని కంకిపాడు సీఐ వీ.శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి ఆదేశాలతో గన్నవరం డీఎస్పీ జయసూర్య దిశానిర్దేశత్వంతో ఈడుపుగల్లు బీసీ కాలనీలో మంగళవారం తెల్లవారు జామున కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీ అంతటా విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. నివాసితుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. అనుమానాస్పదంగా వస్తువులు ఏవైనా ఉన్నాయా? అని తనిఖీలు జరిపారు. తనిఖీల్లో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 20 ద్విచక్ర వాహనాలను సీజ్‌చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు. కోడ్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని చెప్పారు. కోడ్ ఉల్లంఘించి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే సహించేది లేదన్నారు. కొత్త వ్యక్తులకు ఇళ్లల్లో చోటివ్వకూడదని స్పష్టం చేశారు. తనిఖీల్లో పెనమలూరు సీఐ టీవీవీ రామారావు, కంకిపాడు ఎస్ఐ డి.సందీప్, అదనపు ఎస్ఐ తాతాచార్యులు, పెనమలూరు ఎస్ఐలు యేసోబు, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త తొలగింపునకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు



ట్రాక్టర్‌లో చెత్త తరలిస్తున్న కార్మికులు



డ్రెయిన్‌లో పూడిక తీస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో చెత్త తొలగింపునకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన మంగళవారం వివరాలు తెలుపుతూ.. చెత్త తరలించే ప్రైవేటు ఏజెన్సీ, వ్యాన్ డ్రైవర్లకు మధ్య వివాదం కారణంగా వాహనాల్లో చెత్తను తరలించడం లేదన్నారు. దీంతో గత వారం రోజులుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. చెత్త సమస్య పరిష్కారం చేయటానికి ప్రత్యేకంగా ట్రాక్టర్లు తిప్పుతున్నామన్నారు. ఇళ్లల్లోని చెత్తను చెత్త కుండీల వద్ద వేయాలని సూచించారు. కుండీల వద్ద చెత్తను మున్సిపాలిటీ కార్మికులు తొలగిస్తారన్నారు. భవిష్యత్‌లో చెత్త తొలగించే సమస్యలు రాకుండా ఉండటానికి ప్రత్యామ్నాయంగా ప్రత్యేకంగా రిక్షాలు కొనుగోలు చేస్తున్నామన్నారు. ప్రైవేటు ఏజెన్సీతో పని లేకుండా చెత్త తొలగించే బాధ్యత నేరుగా మున్సిపాలిటీనే చేపడుతుందని కమిషనర్ వెంకటేశ్వరరావు చెప్పారు.

పారిశుద్ధ్యం మెరుగుదలకు ప్రత్యేక చర్యలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరులో పారిశుద్ధ్యం మెరుగుపరచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్ తెలిపారు. నిడమానూరులో ప్రధాన గ్రామం, కాల్వగట్టు ప్రాంతంలో మంగళవారం సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్లను పూడిక తీసి, అంతర్గత రహదారుల్లో పేరుకుపోయిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌నాథ్ మాట్లాడుతూ పారిశుద్ధ్యం ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా గ్రామంలో ఎక్కడా చెత్త కనిపించకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పారిశుద్ధ్య సిబ్బందిని అప్రమత్తం చేసి ప్రధాన గ్రామంతో పాటు జాతీయ రహదారిపై పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నామన్నారు. పారుదలకు నోచుకోని డ్రెయిన్లలో మురుగునీరు సజావుగా పారుదల అయ్యేందుకు పూడిక తీస్తున్నట్లు చెప్పారు. పారిశుద్ధ్య నిర్వహణపై ఏమైనా సమస్యలు ఎదురైతే నేరుగా పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించాలి



వంట ఏజెన్సీలకు శిక్షణ ఇస్తున్న అధికారులు

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నాణ్యమైన, రుచికరమైన వంటల తయారీపై వంట ఏజెన్సీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి కొండా రవికుమార్ మాట్లాడుతూ.. పిల్లల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు మంచి పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలన్నారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం మెనూలో మార్పులు చేపట్టిందని తెలిపారు. వంట ఏజెన్సీలు తప్పనిసారిగా మెనూ ప్రకారం ప్రతి రోజు విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించాలని సూచించారు. వంటల తయారీలో నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండడంతోనే చదువుపై శ్రద్ధ చూపిస్తారని తెలిపారు. ఎంఈఓ–2 కమల, పలువురు సీఆర్పీలు, 54 పాఠశాలలకు చెందిన వంట ఏజెన్సీలు పాల్గొన్నారు.

మనోహరం.. అన్నమయ్య పద సంకీర్తనం



నారాయణ తీర్థుల తరంగాలను ఆవిష్కరిస్తున్న మాగంటి, మల్లాది, శ్రీరాం, రవికుమార్ తదితరులు

విజయవాడకల్చరల్: శ్రీ వేంకటేశ్వరా సంకీర్తనా అకాడమీ(శ్వాస), కంచి కామకోటి పీఠస్థ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో లబ్బీపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న పద కవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యుని 616 వ జయంతి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. మంగళవారం నాటి కార్యక్రమాలు శృతిలయ నివాస్ విద్యార్థుల బృంద గానంతో ప్రారంభమయ్యాయి. యువ సంగీత విద్వాంసురాలు సాత్వికా మోహన్, ఆకాశవాణి నిలయ విద్వాంసులు విష్ణుభొట్ల సరస్వతి, విష్ణుభొట్ల కృష్ణవేణి, మల్లాది సూరిబాబు మధురంగా అన్నమయ్య కీర్తనలను గానం చేశారు. కార్యక్రమంలో భాగంగా మల్లాది సూరిబాబు రచించిన నారాయణ తీర్థుల తరంగాలు సంగీత గ్రంథాన్ని లబ్బీపేట వెంకటేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ మాగంటి గోపాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణ తరంగాలు భక్తిభావ వీచికలుగా అభివర్ణించారు. సంగీత విద్వాంసుడు గౌరీనాథ్ మాట్లాడుతూ గుంటూరు జిల్లాకు చెందిన నారాయణ తీర్థులు రాసిన తరంగాలు నేటికీ నిత్య నూతనంగా విలసిల్లుతున్నాయన్నారు. ఆవిష్కరణ కార్యక్రమంలో మల్లాది శ్రీ రాం ప్రసాద్, రవికుమార్‌తో పాటు పలువురు సంగీత విద్వాంసులు పాల్గొన్నారు.

దేవస్థాన బస్సులు, స్నానఘాట్లలో ఈవో తనిఖీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన బస్సులు, దుర్గాఘాట్‌లోని స్నానఘాట్లలో ఆలయ ఈవో కె.ఎస్.రామరావు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజయవాడ బస్టాండ్ నుంచి దుర్గగుడికి నడిపే బస్సు మంగళవారం సాయంత్రం దుర్గాఘాట్ వద్దకు చేరుకుంది. అదే సమయంలో అక్కడికి విచ్చేసిన ఈవో రామరావు బస్సులోకి ఎక్కి యాత్రికుల వద్ద టికెట్లను తనిఖీ చేశారు. అనంతరం దుర్గాఘాట్‌లోకి చేరుకున్న ఈవో అక్కడి దుకాణాలను పరిశీలించారు. భక్తులు దుస్తులు మార్చుకునేందుకు నిర్మించిన షెడ్లు తాళాలు వేసి ఉండటంపై ఈవో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కేశ ఖండనశాలకు వెళ్లి అక్కడి భక్తులు, నాయీబ్రాహ్మణులతో మాట్లాడారు. ఈఈ లింగం రమాదేవి, ఏఈ సునీల్, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు మార్జిన్లు ఇలా.. రాకపోకలు ఎలా..?



కంకిపాడు చెత్త డొంక సర్వీసు రోడ్డులో పేరుకుపోయిన కోళ్ల వ్యర్థాలు



చైతన్య అండర్‌పాస్ వద్ద వ్యర్థాల గుట్టలు



కంకిపాడు – గోసాల నడుమ హైవే వెంబడి పరిస్థితి

నిత్యం రాకపోకలతో రద్దీగా ఉండే విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారిపై రహదారుల శాఖతో పాటు స్థానిక సంస్థలు కూడా పర్యవేక్షణను విస్మరించాయి. పెనమలూరు నియోజకవర్గంలోని పలు ప్రధాన గ్రామాల మీదుగా జాతీయ రహదారి ఉంది. ఏ ఒక్క చోట చూసినా వ్యర్థాల గుట్టలు మేట వేసుకుని ఉన్నాయి. రోడ్డు మార్జిన్లు, సర్వీసు రోడ్లు, బైపాస్ మార్గం ప్రదేశం ఏదైనా వ్యర్థాల గుట్టలు గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. కోళ్ల వ్యర్థాలు, సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడే వేస్తున్నారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటే ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ముక్కుపుటాలు అదిరిపోయే దుర్గంధంతో ప్రయాణం సాగించలేక ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మార్జిన్ల నిర్వహణపై అధికారులు దృష్టి సారిస్తే ఇబ్బందులు తొలగుతాయని వాహనదారులు, ప్రజలు సూచిస్తున్నారు.

– కంకిపాడు